క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు



రెంటాల(రెంటచింతల): రెంటాల గ్రామంలోని పాండురంగస్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి సత్రశాల మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అనీల్‌కుమార్ శర్మ అయ్యప్పస్వామి పడిపూజను కేరళ సాంప్రదాయం ప్రకారం నిర్వహించారు. వివిధ రకాల అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణతో ఆ ప్రాంతమంతా పులకించిపోయింది. పాండురంగ స్వామి యూత్ యువ గణేష్ సభ్యులు ఈ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



రెంటచింతల: సుబ్బన్నతోట కాలనీలోని అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు నాళం పెద్దబాబు, ప్రధాన అర్చకుడు ఓరుగంటి మారుతిశర్మ గురువారం తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ తదితర పూజా కార్యక్రమాలతో పాటు 9.30గంటలకు లక్ష తులసీదళార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం స్వామి వారి శాంతి కల్యాణం మహోత్సవాన్ని నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు దేవస్థానం పాలకవర్గం సభ్యులు తెలిపారు.

నేడు గోగులపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గురజాల: మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ నందేల రాములమ్మ రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, అభివృద్ధి పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

శ్మశాన వాటిక పరిరక్షణ చర్యలు

కారెంపూడి: దాచేపల్లి వెళ్లే రోడ్డు పక్క ఉన్న ఎస్సీ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు గురువారం చేపట్టారు. ఆక్రమణలకు గురవుతున్న శ్మశాన స్థలం పరిరక్షణ చర్యలు తీసుకున్నారు. కారెంపూడి వీఆర్వో కృష్ణప్రసాద్ 299సర్వే నంబరులో ఉన్న శ్మశాన స్థలం హద్దులు గుర్తించి ఎస్సీలకు చూపారు. సర్వేయర్ సులేమాన్‌ఖాన్ శుక్రవారం స్థలాన్ని సందర్శించి, హద్దులు నిర్ణయించనున్నారు.

వైఎస్సార్ హెల్త్ కిట్స్ పంపిణీ

కారెంపూడి: చినగార్లపాడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు గురువారం వైఎస్సార్ హెల్త్ కిట్లు (పౌష్టికాహార పదార్థాలు)ను గ్రామ సర్పంచ్ బద్దూరి బుజ్జి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. గర్భిణులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్ ఎం.సుజాతను కోరారు.

పీహెచ్‌సీలో అన్నదానం



కారెంపూడి: స్థానిక శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కారెంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, రోగులు 80 మందికి గురువారం అన్నదానం చేశారు. ప్రతి నెల 9న పీహెచ్‌సీలో జరిగే ప్రత్యేక వైద్య శిబిరంలో ఆహారాన్ని అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం

గురజాల: దేశ అభివృద్ధి మహిళా సాధికారికతతోనే సాధ్యమవుతుందని జూనియర్ సివిల్ జడ్జి కె.మంజులత పేర్కొన్నారు. స్థానిక కోర్టు భవనాల నందు జాతీయ మహిళా కమిషన్ సౌజన్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డ్వాక్రా మహిళలో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మంజులత మాట్లాడుతూ.. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది షేక్ జానీబాష, ఏపీఎం కృష్ణారెడ్డి తదితరులున్నారు.

అటవీ భూముల్లోకి వెళ్తే.. కేసులు నమోదు చేస్తాం



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో మురళీ

దాచేపల్లి: అటవీ భూముల్లోకి వెళ్తే కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ డీఆర్వో మురళీ హెచ్చరించారు. మండలంలోని శంకరపురం గ్రామంలో గురువారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మురళీ మాట్లాడుతూ..శంకరపురం గ్రామ సమీపంలోని అటవీ భూముల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, నిబంధనలు అతిక్రమించి ప్రవేశిస్తే పీడీ యాక్టు కింద కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ భూములను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇప్పించాలని అధికారులను గ్రామస్తులు కోరారు. అందుకు స్పందించిన డీఆర్వో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ జంగా సురేష్, వీఆర్వో పత్రా రమేష్, అటవీశాఖ అధికారులు శేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి



సూచనలిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం జిల్లా నోడల్ ఆఫీసర్ చంద్రశేఖర్

నకరికల్లు: గర్భిణులు రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటే సుఖప్రసవంలో పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చని డెప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ, ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నకరికల్లులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపుల గురించి డాక్టర్ చంద్రశేఖర్ వాకబు చేశారు. ఏయే గ్రామాలకు ఎప్పుడు వెళ్లాలో ముందుగా తేదీలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్యపరిస్థితిని ఆరా తీశారు. వైద్యశాలలో అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు, మందులను తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వి.శ్రీనునాయక్, బి.నాగమణి, సీహెచ్ఓ కె.మల్లయ్య, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐలు

రాజుపాలెం: విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగి ఉంటే జీవితంలో విజయం సొంతమవుతుందని పల్నాడు జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐలు వి.గౌతమి, వైసీహెచ్ అల్లూరి రెడ్డి చెప్పారు. అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్ఐలు మాట్లాడుతూ ఆపద సమయంలో దిశా యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. 1098, 102, 100 హెల్ప్‌లైన్ నంబర్లను గురించి వివరించారు. ప్రతిఒక్కరూ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సానికొమ్ము వెంకటసుబ్బమ్మ శ్రీనివాసరెడ్డి, ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ నిర్వాహకులు మాజీ సర్పంచ్ రామాంజనేయులు, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఎమ్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పెదకూరపాడు: గుంటూరులో శనివారం జరిగే ప్రగతి నారీ శక్తి అవార్డుల ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్లను పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ ప్రతిభ చాటుతున్న మహిళలను సత్కరించుకోవడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రగతి నారీ శక్తి గౌరవ అధ్యక్షురాలు రాజకుమారి, జాతీయ అధ్యక్షురాలు పి.దేవి, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చైర్మన్ అనురాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలు

నరసరావుపేట టౌన్: పలు చోరీ కేసుల్లో నిందితుడిపై నేరం రుజువు కావటంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 రూపాయల జరిమాన విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. లింగంగుంట్ల గ్రామానికి చెందిన దాసరి విజయ్ నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది ఆరు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు విజయ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి అభియోగ పత్రం దాఖ లు చేశారు. నేరం రుజువు కావటంతో ఒక్కొక్క కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ శిక్షను ఏకకాలంలో అనుభవించేలా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.


నాణ్యమైన భోజనాన్ని అందించాలి



బెల్లంకొండ కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

బెల్లంకొండ: పాఠశాలలో బాలికలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. బెల్లంకొండ క్రాస్‌రోడ్ వద్ద గల కేజీబీవీ జీబీవి పాఠశాలను బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. బాలికలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. భోజనం గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం తాము ఇష్టంగా తినేలా భోజనం అందిస్తున్నారని బాలికలు చైర్మన్‌కు తెలిపారు. వంటశాలకు వెళ్లి విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణతో పాటుగా వంటశాల పరిశుభ్రంగా ఉండడంతో పాఠశాల సిబ్బందిని ఆయన అభినందించారు. ఆయన వెంట ఎంఈఓ మల్లికార్జున శర్మ, ఎంపీడీఓ వెంకటరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

120 మంది గర్భిణులకు అమృతాహారం



గర్భిణులకు అమృతాహారం అందజేస్తున్న సమితి సభ్యులు

అచ్చంపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 120 మంది గర్భిణులకు పౌష్టిక విలువలతో కూడిన అమృతాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి తిమ్మిశెట్టి రాంబాబు మాట్లాడుతూ ఐదు నెలలుగా ప్రతి నెలా 9న తమ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు అమృతాహారాన్ని అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్, ప్రముఖ వైద్యులు మామిళ్లపల్లి మధుసూదనరావు సతీమణి విజయలక్ష్మి, సంస్థ సభ్యులు గొల్లపూడి అనిల్‌కుమార్, సూదా సదాశివరావు, గార్లపాటి సాంబశివరావు, పొట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



సత్తెనపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు ఈశ్వర కళాశాల 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ షేక్ దాదాసాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణకుమారికి ఇన్వర్టర్ అందించారు కార్యక్రమంలో కళాశాల హెచ్ఆర్ మేనేజర్ యాదగిరి వెంకటేష్, ఇన్‌చార్జ్ కవిత తదితరులు పాల్గొన్నారు.

పూరిపాక దగ్ధం

నాదెండ్ల: గ్యాస్ సిలిండర్ పేలి పూరిపాక దగ్ధమైన సంఘటన మండలంలోని నాదెండ్ల బీసీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. అగ్ని మాపక దళ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల బీసీ కాలనీ సచివాలయం–2 సమీపంలో పోతూరి రామయ్యకు చెందిన పూరిపాక మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో సిలిండర్ పేలిపోవటంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న వస్తువులు, దుస్తులన్నీ కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



పిడుగురాళ్లరూరల్: యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలోని గుత్తికొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్ వివరాల మేరకు.. గుత్తికొండ గ్రామానికి చెందిన నారికేళ్లపు ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని తండ్రి సాంబశివరావు గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్ల వయసున్న ఈ యువకుడు ఎవరికైనా కనిపిస్తే 9000945696 నంబరుకి సమాచారం ఇవ్వాలని చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాచవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మాచవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల పథకాల అమలు, అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

జూదరుల అరెస్ట్

మాచవరం: మండలంలోని రేగులగడ్డ గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. సమాచారం మేరకు పిడుగురాళ్ల ఎస్ఈబీ, స్థానిక పోలీస్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టులను భర్తీ చేయాలి

గురజాల: డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకులు, నైట్ వాచ్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డివిజన్ అధ్యక్షుడు బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు జి.రవిబాబు, ప్రధాన కార్యదర్శి బొనిగె ఆనందరాజు, గాలి లక్ష్మయ్య, కె.పుల్లయ్య, డి.ఖాశీంసైద, డి.హైమావతి తదితరులున్నారు.

ఆర్ఐకి సత్కారం



కారెంపూడి: తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్న బి.హరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది గురువారం రాత్రి ఆయనకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాస్, సర్వేయర్ సులేమాన్ ఖాన్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు హరిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందించారు.

ఆసుపత్రిలో భగవద్గీత పఠనం



పూజా కార్యక్రమాల్లో సిబ్బంది

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీ దత్త హాస్పిటల్‌లో గురువారం భగవద్గీత పారాయణం నిర్వహించారు. శ్రీ దత్త స్వామీజీ జన్మ నక్షత్రమైన హస్త నక్షత్రాన్ని పురస్కరించుకొని భగవద్గీతలోని 18 అధ్యాయాలను పఠించారు. అనంతరం ఉచితంగా భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, పీఠాధిపతి నంద స్వామీజీ భగవద్గీత విశిష్ఠతను వివరించారు.

శ్రీలక్ష్మి అమ్మవారి జాతరపై అధికారుల సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ నరసింహబాబు

దుర్గి: ఈ నెల 12న ఆదివారం నిర్వహించనున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం విజయవంతానికి తీసుకోవాల్సి చర్యలపై గురువారం స్థానిక ఆలయ ప్రాంగణంలో మండలస్థాయి అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతరకు 11, 12, 13 తేదీలు ఎంతో కీలకమన్నారు. అడిగొప్పల నుంచి దేవాలయానికి వచ్చే ప్రధాన రహదారిపై నిర్మించిన నూతన బ్రిడ్జి, రెండు అతిథి గదులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ రాజు, ఆర్టీసీ సూపర్‌వైజర్ ఎం.లచ్చయ్య తదితరులున్నారు.

బ్రహ్మంగారి తిరునాళ్ల గ్రామ ఐక్యతకు నిదర్శనం: పీవీఆర్



తిరునాళ్ల సందర్భంగా మాట్లాడుతున్న పీవీఆర్

మాచర్ల రూరల్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించుకోవటం గ్రామ ప్రజల ఐక్యతకు, శాంతికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కంభంపాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్లలో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వామి వారి ఆశీస్సులతో సమృద్ధిగా పంటలు పండి అన్నదాతలు ఆనందంగా ఉండటం సంతోషకరమన్నారు. పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల యూత్ విభాగం ఇన్‌చార్జిగా నియామకం అయిన సందర్భంగా ఆయనను గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, జువ్వాజి సాంబశివారెడ్డి, పావూరి రామస్వామి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

సీఆర్ కళాశాల వశమైన రోలింగ్ ట్రోఫీ

- అంతర్ కళాశాలల పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు
- యూనివర్సిటీ తరపున జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఐదుగురి ఎంపిక



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో కళాశాల సెక్రటరీ చుండి వేణుగోపాల్

నాదెండ్ల: అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎనిమిదోసారి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుని రోలింగ్ ట్రోఫీని సీఆర్ కళాశాల జట్టు అందుకుంది. ఈ నెల 7,8 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాల సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. సీఆర్ కళాశాల జట్టు ఉత్తమ ప్రతిభ చూపి వరుసగా ఎనిమిదిసారి ప్రథమస్థానం సాధించి రికార్డు నెలకొల్పారు. ఎంఏఎం ఫార్మసీ కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శ్రీమతి మేదరమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు మెమోరియల్ రోలింగ్ ట్రోఫీని మొదటిసారిగా కళాశాల జట్టు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పీడీ నాగేంద్రబాబు, లైబ్రేరియన్ నిరంజన్ తదితరులు అభినందించారు.

యూనివర్సిటీ జట్టుకు ఐదుగురి ఎంపిక

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టుకు సీఆర్ కళాశాల విద్యార్థులైన బి.సతీష్, ఎం.ప్రేమ్‌కుమార్, కె.కుమారబాబు, షేక్ హయం, ఎం సాగర్ బాబులు ఎంపికయ్యారు. వీరు ఏప్రియల్ మొదటి వారంలో చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ తరపున ప్రాతినిథ్యం వహించనున్నారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న షేక్ రఫాని

చిలకలూరిపేట: మంచినీటి సరఫరా పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సూచించారు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పట్టణానికి మంచినీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను గురువారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలో నీటి సరఫరా నిలిచిన క్రమంలో పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను అధికారులతో కలసి మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నానికి పనులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని చెప్పారు. వేసవి కాలం నీటి సరఫరా ఆవశ్యకతను గుర్తించి పనులు వేగవంతంగా నిర్వహించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ డీఈఈ శ్రీనివాసరావు, సుబ్బరామిరెడ్డి, కృష్ణారావు, నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.

ఉగాదికి జగనన్న కాలనీలో గృహప్రవేశాలు



అప్పాపురం గ్రామంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ వెంకటరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): ఉగాది పండుగకు శ్లాబ్‌లు వేసిన ఇళ్ల గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని డీఎల్‌డీవో ఎం.వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వి.అప్పాపురం ఎస్సీ కాలనీలో జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని గురువారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం నూజెండ్ల గ్రామసచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందజేయడంలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.నరేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బలరాం తదితరులు ఉన్నారు.

రబీ పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

మొక్కజొన్నలో ఆకుముడత నివారణకు సూచనలు



మినుము పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల బృందం

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో రబీలో సాగవుతున్న పంటలను గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్‌బాబు, శాస్త్రవేత్తల బృందం మొక్కజొన్న, మినుము, కంది పంటపొలాలను సందర్శించారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌చంద్ర మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మొక్కజొన్నలో టర్శికమ్ ఆకుముడతను గుర్తించి దీని నివారణకు మాంకోజెబ్ ఎకరాకు 400 గ్రాములు లేదా అమిస్టార్ టాప్ 200 మిల్లీగ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్నలో అక్కడక్కడ కాడకుళ్ళు తెగులు గుర్తించారు. మినుములో పీయూ31 రకాన్ని పరిశీలించిరాబోవు కాలంలో మేలురకమైన ఎల్‌బీజీ 930 రకాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. ఈ రకం అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు.